సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం, 1, అక్టోబర్, 2024



హైవే పనుల్లో నాణ్యతకు తూట్లు

హైవే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపిస్తూ రాజవొమ్మంగిలో సోమవారం ఆందోళన చేశారు. 8లో



కేకే లైన్‌లో డబ్లింగ్ పనులు పూర్తి

గోరాపుర్–దార్లిపుట్ సెక్షన్‌లో డబ్లింగ్ పనులను పూర్తిచేసినట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ తెలిపారు. 8లో



హుండీ ఆదాయం రూ.1.39 కోట్లు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి హుండీ ఆదాయం గత 28 రోజులకుగాను రూ.1,39,44,045 వచ్చింది.

న్యూస్‌రీల్

కెరీర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం: పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు కెరీర్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక వైటీసీలో ఏటీడబ్ల్యూవోలు, ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు మార్గదర్శి కెరీర్ గైడెన్స్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సోమవారం కలెక్టర్ మాట్లాడారు. మార్గదర్శి ప్రోగ్రామ్‌లో ముందుగా మాస్టర్ ట్రైనర్‌లకు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. వీరు మండలాల్లోని ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు మార్గదర్శి కార్యక్రమం ద్వారా అగ్రికల్చర్, డిప్లమో, ఇంజినీరింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ, పారా మెడికల్ కోర్సులపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో వారానికి ఒక రోజు గంట పాటు మార్గదర్శి కెరీర్ గైడెన్స్ పై శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. విద్యార్థులకు బేస్ లైన్ పరీక్షలు నిర్వహించి సామర్థ్యాల వారీగా గ్రూపులుగా విభజించాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రోహిణి బాధ్యతల స్వీకరణ



డాక్టర్ రోహిణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

పాడేరు: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిగా డాక్టర్ రోహిణి సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. స్థానిక కార్యాలయ సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఇంతవరకు ఇక్కడ పని చేసిన ప్రశాంత్‌కుమార్‌ను విజయనగరం బదిలీ చేసిన సంగతి తెలిసిందే.

జాబ్ మేళాలో 62 మంది ఎంపిక



ఎంపికైన అభ్యర్థులతో అధికారులు

రంపచోడవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఐటీడీఏ సంయుక్తంగా రంపచోడవరం డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో వివిధ కంపెనీల్లో కొలువులకు 60 మంది ఎంపికయ్యారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఉపాధి అధికారి సంగీత మాట్లాడుతూ జాబ్ మేళాలో ఐదు కంపెనీలు పాల్గొన్నాయని, 182 మంది హాజరు కాగా 62 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.రోహిణి, ప్రిన్సిపాల్ డి.చిట్టిబాబు, వైస్‌ప్రిన్సిపాల్ రవికుమార్,స్కిల్ కోఆర్డినేటర్ కె.జి. వెంకటేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సీఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మోతుగూడెం: ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్‌లోని కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు.సీలేరు, డొంకరాయి,మోతుగూడెంలకు చెందిన కాంట్రాక్ట్ కార్మికులు మోతుగూడెం సీఐటీయూ కార్యాలయం నుంచి సీఈ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, సీఈ వాసుదేవరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. విద్యుత్‌సంస్థలో పనిచేసే ప్రతి కార్మికుడిని పర్మినెంట్ చేయాలని, 2022 పీఆర్‌సీ ప్రకారం వేతనాలు, ఎరియర్స్ ఇవ్వాలని, 17 మంది కాంట్రాక్టు కార్మికులను మేన్‌పవర్‌గా మార్చాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతా రాంబాబు, రత్నాకర్, బి.వి.రమణ, సుభాని తదితరులు పాల్గొన్నారు.



గ్రామ వలంటీర్లతో మాట్లాడుతున్న పాడేరు జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్



పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డైలీవేజ్ ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు

ధర్నాలతో... దద్దరిల్లిన పాడేరు

గ్రామ వలంటీర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డైలీవేజ్ ఉద్యోగులు వేర్వేరుగా చేసిన ధర్నాలు, ర్యాలీలతో పాడేరు దద్దరిల్లింది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారు కదం తొక్కారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నేతలు వాటిని విస్మరించారని, వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 8లో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు కసరత్తు

- ఉపాధ్యాయులూ.. ఓటు హక్కు నమోదు చేసుకోండి
- విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్



ఉపాధ్యాయుల ఓటు నమోదుపై సమీక్షిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సూచించారు. సెప్టెంబర్ 30న నోటిఫికేషన్ వెలువడిందని, సోమవారం నుంచి ఓటు నమోదు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. నవంబర్ 6 వరకు కొనసాగుతుందన్నారు. నవంబర్ 23న డ్రాఫ్ట్ పబ్లిష్ అవుతుందని, 23 నుంచి డిసెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ,డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో 34 ఈఆర్వోలను, 187 మంది ఏఆర్వోలను నియమించామన్నారు. ఉత్తరాంధ్ర పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోకి వస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఓటు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు సెకండరీ స్థాయికి మించిన పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా అర్హులేనని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 43 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 1941 కేంద్రాలు ఉండగా 1500 ఓటర్లు దాటిన చోట కొత్త వాటిని ప్రతిపాదిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఆర్డీవో లు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, ప్రత్యేక ఉప కలెక్టర్లు సీతారామమూర్తి, శేష శైలజ, లక్ష్మారెడ్డి, తహశీల్దార్లు, ఎలక్షన్ డీటీలు పాల్గొన్నారు.

గోదావరిలో జాలర్ల అక్రమ దందా

గోదావరి జలాల్లో ఇతర ప్రాంతాల జాలర్ల అక్రమ దందా జోరుగా సాగుతోంది. వారు నిషేధిత వలలతో చిరు చేపల వేట చేస్తూ స్థానికుల బతుకు తెరువుకు గండికొడుతున్నారు. మరో వైపు మత్స్య సంపద మనుగడకు ముప్పు వాటిల్లేలా చేస్తున్నారు. గోదావరి తీరంలో మకాం వేసి మత్స్య సంపదను దోచుకెళుతూ కోట్లాది రూపాయల వ్యాపారం సాగిస్తున్నారు. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.



వలకు చిక్కిన చిరు చేపలు



వేటాడిన చిరు చేపలు

- యథేచ్ఛగా చిరు చేపల వేట
- ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నిషేధిత వలల వినియోగం
- స్థానికుల బతుకుతెరువుకు గండి
- పట్టించుకోని మత్స్య, అటవీ శాఖ అధికారులు

రంపచోడవరం/దేవీపట్నం: గోదావరిలో చిరు చేపల అక్రమ వేట యథేచ్ఛగా సాగుతోంది.అక్రమార్కులు ఇక్కడ చిరు చేపలను పట్టి బయట ప్రాంతాలకు తరలిస్తూ కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తూ స్థానిక మత్స్యకారుల కడుపుకొడుతున్నారు. చిరు చేపల వేటపై నిషేధమున్నా అనకాపల్లి, విశాఖ, కొవ్వూరు, విజయవాడ,కృష్ణలంక, తెలంగాణ, యానాం వంటి ప్రాంతాల నుంచి వచ్చి వేటాడుతూ తరలించుకుపోతున్నారు. పాపికొండల నేషనల్ పార్క్ పరిధిలో చేపల వేట నిషేధం ఉన్నా అక్రమార్కులు పట్టించుకోవడం లేదు.

అలవి వలలతో స్థానికుల జీవనోపాధికి గండి

నదులు, రిజర్వాయర్లలో చేపలు వేటాడేందుకు 2.5 సెంటీ మీటర్ల కంటే తక్కువ సైజు రంధ్రాలు ఉన్న అలవి వలలు వాడడం నిషేధం. తక్కువ సైజు రంధ్రాలు ఉన్న వలలు వినియోగించడం వల్ల చిరు చేపలు (స్పాన్ దశ) వాటికి చిక్కుకుంటాయి. సాధారణంగా జూన్, జూలై నెలల్లో చేపలు పునరుత్పత్తి దశలో చిరు చేపలు(స్పాన్)ను విడుదల చేస్తాయి. అవి తల్లి చేపల నుంచి వేరై పెరిగేందుకు కనీసం మూడు నెలలు సమయం పడుతుంది. తరువాత ఆ చేపలను వేటాడవచ్చు. అయితే సెప్టెంబరు మొదటి వారం నుంచే అక్రమార్కులు చేపల వేట ప్రారంభించడంతో సీజన్‌లో స్థానిక మత్స్యకారులకు వేటాడేందుకు చేపలు ఉండడం లేదు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 200 మంది వరకు పోశమ్మ గండి, వీరవరం లంక, ఖాళీ చేసిన గోదావరి ఒడ్డు గ్రామాల్లో మకాం వేసి వేటను కొనసాగిస్తున్నారు. అధికారుల అండదండలు ఉండడంతో వీరికి ఎదురులేకుండా పోతోంది. పట్టుకున్న చిరు చేపలను ఎండబెట్టి ఏటా 200 టన్నుల వరకు చెన్నైకు రవాణా చేస్తున్నారు. వీటిలో ఎక్కువ పోషక విలువలు ఉండడంతో చిరు చేపలకు మార్కెట్‌లో గిరాకీ ఉంది.

పేరుకే తనిఖీలు..

స్థానిక మత్స్యకారులు అభ్యంతరం వ్యక్తం చేసినా.. భయపడకుండా ఇతర ప్రాంతాల వారు యథేచ్ఛగా వేటను సాగిస్తున్నారు. ఈవిషయంపై మత్స్యశాఖాధికారులకు ఫిర్యాదు చేసినా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. మత్స్యశాఖ, అటవీ శాఖ సిబ్బంది. పేరుకు మాత్రమే తనిఖీలు చేస్తున్నారని అంటున్నారు.



వారం రోజుల క్రితం గోదావరిలో వేటకు వెళుతున్న మత్స్యకారులు

నేషనల్ పార్కు పరిధిలో వేట నిషేధం



దేవీపట్నం గ్రామం దాటిన తరువాత అగ్రహారం గ్రామం నుంచి పాపికొండల నేషనల్ పార్కు పరిధిలోకి వస్తుంది. అక్కడ నుంచి గోదావరి జలాల్లో చేపల వేట నిషేధం. రెండు రోజుల క్రితం గోదావరిలో చేపల వేట కోసం వచ్చిన కొంత మందిని పోశమ్మ గండి ప్రాంతం నుంచి బయటకు పంపించడం జరిగింది. పోలీసు,రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా ఆ ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక మత్స్యకారులు, ఫిషరీ సొసైటీ సభ్యులు మాత్రమే చేపలు వేట చేసుకోవచ్చు. వీరు బయట వారిని వేట కోసం అనుమతిస్తే చర్యలు తీసుకుంటాం.

– దుర్గాకుమార్‌బాబు, ఫారెస్టు రేంజ్ అధికారి, ఇందుకూరు రేంజ్

మత్స్య సంపద మనుగడకే ముప్పు



2.5సెంటీమీటర్ల కంటే తక్కువ సైజు రంధ్రాలు ఉన్న వలలను చేపల వేటకు వినియోగించడం నిషేధం. వాటిని వినియోగించే వారిపై కేసులు నమోదు చేసి, భారీగా జరిమానా విధించవచ్చు. చిరు చేపలు(స్పాన్) వేటాడడం వల్ల మత్స్య సంపద మనుగడకే ముప్పు వాటిల్లుతుంది. సీజన్‌లో వేటాడే వారికి చేపలు దొరకవు. స్పాన్ రెండు నెలల్లో ఫ్రై స్టేజ్‌కు వస్తాయి. అప్పుడు కేజీన్నర వరకు చేపలు పెరుగుతాయి. గోదావరిలో చిరుచేపల వేటను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

– వీరాంజనేయులు, మత్స్యశాఖ శాస్త్రవేత్త, కేవీకే, పందిరిమామిడి

కేజీహెచ్ నుంచి గిరిజన విద్యార్థి పరారీ

తండ్రితో పాటు వెళ్లిపోయిన బాలుడు



సురేష్

కొయ్యూరు: కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న డౌనూరు ఆశ్రమ పాఠశాల విద్యార్థి కొర్రా సురేష్ సోమవారం పరారయ్యాడు. సెప్టెంబర్ మొదటి వారంలో వినాయక చవితి సందర్భంగా స్వగ్రామం చింతపల్లి మండలంలో కొడిసింగికి సురేష్ వెళ్లాడు. తిరిగి పాఠశాలకు రాకపోవడంతో వార్డెన్ హరి కుటుంబ సభ్యులకు ఫోన్ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్నాడని కుటుంబ సభ్యులు చెప్పడంతో తాజంగి ఆస్పత్రికి తీసుకురావాలని సూచించినా తీసుకురాలేదు. స్థానికంగా నాటు వైద్యం చేయిస్తామని, ఆస్పత్రికి పంపేది లేదని భీష్మించారు. ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, హెచ్ఎం ప్రభుదాస్ కొడిసింగి వెళ్లి తల్లిదండ్రులకు నచ్చచెప్పి సెప్టెంబర్ 25న సర్పీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. 26న మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొంత వరకు కోలుకున్నాడు.అయితే సోమవారం వార్డెన్ హరిదేవ్ విద్యార్థికి సంబంధించిన ల్యాబ్ రిపోర్ట్స్ తీసుకువచ్చేందుకు వెళ్లారు. తండ్రి రాముడి, సురేష్ ఆస్పత్రిలో కనిపించలేదు. వారు వెళ్లిపోయిన విషయాన్ని గమనించాడు. పీవో చొరవ చూపి విద్యార్థికి మెరుగైన వైద్యం అందిస్తున్న సమయంలో వెళ్లిపోయారని ఆయన విలేకరులకు తెలిపారు.తిరిగి విద్యార్థి ఆస్పత్రికి వస్తే మెరుగైన వైద్యం అందిస్తామన్నారు.

గంజాయి అక్రమ రవాణపై డ్రోన్లతో నిఘా

- ఎస్పీ అమిత్ బర్దర్ హెచ్చరిక
- కొయ్యూరులో 110 కిలోల గంజాయి స్వాధీనం



మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దర్

పాడేరు : గంజాయి అక్రమ రవాణపై పటిష్ట నిఘా పెట్టామని ఎస్పీ అమిత్‌బర్దర్ తెలిపారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లి విలువైన జీవితాలను చిత్తు చేసుకోవద్దని హితవు పలికారు. కొయ్యూరు మండలం గుడ్లపల్లి గ్రామ శివారులో స్వాధీనం చేసుకున్న గంజాయి వివరాలను సోమవారం సాయంత్రం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ విలేకరులకు వెల్లడించారు. కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో గుడ్లపల్లి శివారులో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో గంజాయితో వస్తున్న ఓ ఆటోను వెనక్కి తిప్పి తప్పించుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్నారు. ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు తాము గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. ఆటోలో తరలిస్తున్న 110 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, ఆటోను సీజ్ చేశామన్నారు. గంజాయి రవాణా నివారణ కోసం డ్రోన్ల ద్వారా నిఘా పెట్టామని చెప్పారు. నిత్యం ప్రత్యేక స్క్వాడ్‌తో తనిఖీలు ముమ్మరం చేశామని ఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో పాడేరు ఏఎస్పీ ధీరజ్, ఎస్బీ సీఐ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ -కిరండూల్‌కు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం(విశాఖ) : ఈ సీజన్‌లో అరకు అందాలను వీక్షించే పర్యాటకులు, ప్రయాణికుల సౌకర్యార్థం, వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల జాబితాను క్లియర్ చేసేందుకు కిరండూల్ రైళ్లకు ఆయా తేదీలలో, వారాంతపు రోజుల్లో అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ నెల 3,5,7,9,11,13,15,17,19 తేదీల్లో విశాఖలో బయల్దేరే విశాఖ -కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు, ఈ నెల 4,6,8,10,12,14,16,18,20 తేదీల్లో కిరండూల్‌లో బయల్దేరే కిరండూల్–విశాఖ (08552) పాసింజర్ స్పెషల్‌కు ఒక విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.ఈనెల 2,4,6,8, 10,12,14,16,18,20 తేదీల్లో విశాఖలో బయ ల్దేరే విశాఖ–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు, ఈ నెల 3,5,7,9,11,13,15,17,19,21వ తేదీలలో కిరండూల్‌లో బయల్దేరే కిరండూల్–విశాఖ (08552) పాసింజర్ స్పెషల్‌కు ఒక థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు



గిరిజన గురుకుల పాఠశాలలో సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

పాడేరు : ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాల మేరకు ఐటీడీఏ పరిధిలోని అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గిరిజన గురుకుల విద్యాలయాలలో విద్యార్థులకు సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్‌బాషా తెలిపారు. సోమవారం పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి మాత్రలను పంపిణీ చేశారు. పాఠశాలలో 85 మంది వైద్య పరీక్షలు నిర్వహించి, వీరిలో 9 మంది సాధారణ జ్వరాలతో బాధపడుతున్నట్టు నిర్ధారించి మందులను అందజేశారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గణేష్, ఆరోగ్య విస్తరణాధికారి గుల్లెలి సింహాద్రి, వైద్యారోగ్య శాఖ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ దినేష్ కుమార్
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 242 అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం: జాతీయ రహదారి 516 నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 242 అర్జీలను స్వీకరించారు. దేవీపట్నం మండలం తున్నూరు పంచాయతీలోని వేముల కొండ నుంచి తున్నూరు వరకు నాలుగు కిలోమీటర్లు రోడ్డు నిర్మించాలని గిరిజనులు కోరారు. ఆకూరు నుంచి మామిడి వలస వరకు ఐదు కిలోమీటర్లు మెటల్ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. పందిరిమామిడి నుంచి చవిటిదిబ్బల వరకు రోడ్డు పనులు పూర్తి చేయాలని ఎంపీటీసీ బచ్చల మంగా, చిలకల సత్యనారాయణ,కింటూకూరి సూరిబాబు కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పెదభీంపల్లి -3 కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ,వాటర్ ట్యాంకు, ప్రహరీగోడ ఏర్పాటు చేయాలని స్థానికులు అర్జీ అందజేశారు.18 సంవత్సరాలు నిండిన యువతకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, కొండరెడ్డిలకు ఐదు ఎకరాల సాగు భూమి మంజూరు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గుర్తేడు గ్రామంలో గ్రామ కంఠం భూములకు రీసర్వే చేసి హద్దులు నిర్ణయించాలని ఆ గ్రామస్తులు అర్జీ అందజేశారు. ఆకుమామిడికోట నుంచి పాతకోట రోడ్డు అధ్వానంగా ఉందని కొత్త రోడ్డు ఏర్పాటు చేయాలని , పాతకోటకు మరో బస్సు సర్వీస్ నడపాలని స్థానికులు కోరారు.

క్లుప్తంగా

అక్రమ చేపల వేటపై విచారణ జరపాలి

రంపచోడవరం: గోదావరి నదిలో అనుమతులు లేకుండా నక్కపల్లి, కొవ్వూరు, పోలవరం, ఏలేశ్వరం ప్రాంతాల నుంచి వచ్చి అక్రమంగా చేపల వేట చేస్తూ లక్షల్లో వ్యాపారం చేస్తున్నారని, సమగ్ర విచారణ జరిపి, వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.కిరణ్ కోరారు. కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. బాధ్యులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గోదావరిలో చేపలు పట్టుకోవడానికి గిరిజనులకు హక్కులు కల్పించాలన్నారు.

వ్యాన్‌ను ఢీకొని కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన నాయుడు ప్రసాద్

పెదబయలు: మండలంలోని గంపరాయి ఘాటీ వద్ద సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనం, వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెదబయలు మండలం బొండాపల్లి పంచాయతీ ఎగువ బొండాపల్లి గ్రామానికి చెందిన నాయుడు ప్రసాద్ పదేళ్ల నుంచి అల్లూరి జిల్లా చింతూరు డివిజన్‌లో సీఆర్పీఎఫ్ బెటాలియన్ లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. సోమ వారం స్వగ్రామం బొండాపల్లి వెళ్లి తిరిగి బైక్‌పై పాడేరు వెళ్తుండగా ఆయనను ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీ కొట్టింది. తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. తరువాత ఫోన్‌లో ఉన్న సమాచారం ఆధారంగా ప్రసాద్ కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేశారు. పాడేరు నుంచి మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించామని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇంటికి చేరిన కానిస్టేబుల్

పీఎంపాలెం: మహిళా పోలీసు స్టేషన్‌లో పని చేస్తూ అదృశ్యమైన కానిస్టేబుల్ ఇంటికి చేరాడు. పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు..ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకట నరసింహమూర్తి గత నెల 22వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని భార్య కోమలి ఫిర్యాదు చేసింది. ఇదిలావుండగా అదృశ్యమైన కానిస్టేబుల్ మూర్తి తనకు తానుగా ఆదివారం రాత్రి ఇంటికి చేరుకున్నాడు. పని ఒత్తిడి కారణంగా మానసిక ప్రశాంతత కోసం తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నాడని, అంతేతప్ప మరే ఇతర కారణాలు లేవని రాతపూర్వకంగా తెలియజేశాడని సీఐ బాలకృష్ణ చెప్పారు.

ధర్నాలు, ర్యాలీలతో దద్దరిల్లిన పాడేరు


జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

- గ్రామ వలంటీర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్ల ఆందోళన
- కలెక్టరేట్ వరకు వేర్వేరుగా భారీ ర్యాలీలు
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు


రంపచోడవరం ఐటీడీఏ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు


జేసీ అభిషేక్ గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డైలీవేజ్ ఉద్యోగులు


పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఓ వైపు గ్రామ వలంటీర్లు, మరో వైపు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డైలీవేజ్ ఉద్యోగులు పాడేరులో సోమవారం కదం తొక్కారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సుమారు రెండు వేల మంది గ్రామ వలంటీర్లు, వందలాది మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రోడ్డెక్కారు. మోదకొండమ్మ ఆలయం నుంచి పాత బస్టాండ్, సినిమాహాల్ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్, తలార్‌సింగి జంక్షన్ మీదుగా కలెక్టరేట్ వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర గ్రామ వలంటీర్లు భారీ ర్యాలీ నిర్వహించి, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం సుమారు గంటసేపు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ వలంటీర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొమ్మా రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు గ్రామ వలంటీర్లపై కూటమి నేతలు హామీల వర్షం కురిపించారన్నారు. నెలకు రూ.10వేల వేతనం అందజేస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీలు ఇచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా విస్మరించారని చెప్పారు. తక్షణమే తమను విధుల్లోకి తీసుకుని నెలకు రూ.10వేల వేతనం అందజేయాలని లేనిపక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.ఉమామహేశ్వరరావు, బోనంగి చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డైలీవేజ్, క్యాజువల్, అగ్రిమెంట్, అప్రంటిస్ ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు వారి తరఫున పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ వలంటీర్ల సంఘం సంయుక్త కార్యదర్శి కొమ్ము రాంబాబు, జి.మాడుగుల మండల అధ్యక్షుడు మత్స్యరాస కూర్మరాజు, పాడేరు మండల అధ్యక్షుడు గబ్బాడ మహేష్, పలు మండలాల అధ్యక్షులు గొల్లోరి దేవా, వేములపూడి పరమేశ్వరరావు, మేడ వెంకటేష్, బర్లు కొండబాబు, విశ్వనాథం, శశిధర్, మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు లక్ష్మణ్‌రావు, బాలన్న, ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ నాయకులు కొండలరావు, కాఫీ లైజన్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీను, సమగ్ర శిక్ష జేఏసీ జిల్లా కన్వీనర్ వగ్గ జయరాజు, సీఐటీయూ నాయకులు శంకర్‌రావు, సుందర్‌రావు, అధిక సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

రంపచోడవరం ఐటీడీఏ ఎదుట ఆందోళన

రంపచోడవరం: వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులందరిని రెగ్యులర్ చేసి, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో రంపచోడవరం ఐటీడీఏ ఎదుట సోమవారం ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్,పదవీవిరమణ బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు అవుతున్న వలంటీర్లు పట్ల స్పష్టమైన వైఖరి చెప్పడం లేదన్నారు. వెలుగు వీవోఏలకు 17 నెలలు వేతనాలు చెల్లించలేదని, వారు ఎలా జీవించాలని ప్రశ్నించారు. ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

తల్లిదండ్రుల నిర్లక్ష్యంతోనే శిశువుల మృతి

డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా

జి.మాడుగుల: పెదబయలు మండలం గోమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇద్దరు శిశువుల మృతికి వారి తల్లిదండ్రులే కారణమని అల్లూరి జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా తెలియజేశారు. పులుసుమామిడి గ్రామంలో మూడు నెలల వయస్సు గల శిశువు నిమోనియా, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుండగా నాటు మందు ఇవ్వడంతో పరిస్థితి విషమించి, ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, మరో శిశువు విశాఖ కేజీహెచ్‌సీలో వైద్యం పొందుతూ మృతి చెందినట్టు ఆయన చెప్పారు. 'వారం రోజుల్లో ఇద్దరు శిశువుల మృతి' శీర్షికతో గత నెల 30న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి డీఎంహెచ్‌వో స్పందించి ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. గోమంగి పీహెచ్‌సీ పరిధిలో వివిధ లక్షణాలతో ఇద్దరి చిన్నారుల మృతికి గల కారణాలు వైద్యాధికారి పరిశీలనలో తేలినట్టు పేర్కొన్నారు. జి.మాడుగుల మండలం బొయితిలి పంచాయతీ పులుసుమామిడిలో తరడా రమేష్, జ్యోతికలకు చెందిన మూడు నెలల శిశువు నిమోనియా, జలుబు, దగ్గు, ఊపిరితిత్తుల సంబంధించిన లక్షణాలతో ప్రైవేట్ వైద్యం చేయించి ఇంటికి తీసుకువెళ్లగా ఆరోగ్యం విషమించి మృతి చెందినట్టు తెలిపారు. అదే గ్రామానికి చెందిన తోటపల్లి లక్ష్మీపతి యొక్క నాలుగు నెలల శిశువు నిమోనియా, జలుబు, దగ్గు, కడుపునొప్పి, ఊపిరిపీల్చడంలో ఇబ్బంది వంటి కారణంగా జి.మాడుగుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అక్కడ నుంచి పాడేరు జిల్లా ఆస్పత్రికి, మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నం కెజీహెచ్‌కు తరలించగా వైద్యం అందుతూ మృతి చెందినట్టు ప్రకటనలో పేర్కొన్నారు. తల్లిదండ్రుల నిర్లక్ష్యం వల్ల శిశువు మృతి చెందినట్టు ఆయన తెలిపారు. ఇద్దరు శిశువుల ఆరోగ్యంపై వైద్య బృందం ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్టు ఆయన ప్రకటనలో తెలిపారు.

చిత్తశుద్ధితో పనిచేస్తే మంచి గుర్తింపు


తహసీల్దార్ రాజ్యలక్ష్మి దంపతులకు సన్మానిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం,సర్పంచ్ వెంకటపూర్ణిమ


సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం
- సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్

హుకుంపేట: చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రజల వద్ద నుంచి మంచి గౌరవ లభిస్తుందని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ చెప్పారు. మండల కేంద్రంలోని సోమవారం తహసీల్దార్ రాజ్యలక్ష్మి ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ తహసీల్దార్‌గా రాజ్యలక్ష్మి ప్రజలకు ఉత్తమ సేవలందించారని కొనియాడారు. భూ సమస్యలతో పాటు అనేక సమస్యలను పరిష్కరించి, ప్రజల మన్ననలు పొందారన్నారు. ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేసి మంచి గౌరవం పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ మాట్లాడుతూ తహసీల్దార్ రాజ్యలక్ష్మి అందించి సేవలను అభినందించారు. అధికారులు, సిబ్బంది ఆమెను ఆదర్శంగా తీసుకుని మంచి సేవలు అందించాలన్నారు. తహసీల్దార్ దంపతులను ఎమ్మెల్యే, అధికారులు, పలు పార్టీల నేతలు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, డీటీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేకే లైన్‌లో మరో 12 కి.మీ డబ్లింగ్ పనులు పూర్తి

తాటిచెట్లపాలెం(విశాఖ): ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ మరో మైలురాయిని చేరుకుంది. గోరాపుర్–దార్లిపుట్ సెక్షన్‌లో 12.649 కిలోమీటర్ల డబ్లింగ్ పనులను పూర్తిచేసినట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. నూతనంగా ఏర్పాటుచేసిన రెండో లైన్‌ను కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ(సౌత్ ఈస్టర్న్ సర్కిల్) బ్రజేష్ కుమార్ మిశ్రా సోమవారం వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్‌తో కలిసి తనిఖీ చేశారు. గోరాపుర్-దార్లిపుట్ సెక్షన్‌లో నూతనంగా నిర్మించిన 2 ప్రధాన వంతెనలు, 28 చిన్న వంతెనలు, రైల్వే స్టేషన్స్, సిగ్నలింగ్ వ్యవస్థ వంటి ప్రాంతాలను పరిశీలించి అన్ని భద్రతా ప్రమాణాలను తనిఖీ చేశారు. సీఆర్‌ఎస్ సంతృప్తిని వ్యక్తం చేస్తూ ధ్రువీకరించారు. అనంతరం ఈ లైన్‌లో స్పీడ్ ట్రయల్‌ను కూడా నిర్వహించారు. మొత్తం 12.649 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులు పూర్తి చేసిన ఈ సెక్షన్‌లో ఆంధ్రప్రదేశ్‌లో 2 కిలోమీటర్లు, ఒడిశాలో మిగిలిన భాగం ఉన్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కేకే లైన్‌లో పూర్తయిన డబ్లింగ్ పనులతో వాల్తేర్ డివిజన్ మరింత వేగవంతమైన అభివృద్ధిని సాధిస్తుందన్నారు. ఈ తనిఖీలలో వాల్తేర్ డివిజన్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(కన్‌స్ట్రక్షన్) డి.శ్రీనివాసరావు, ఏడీఆర్‌ఎం సుధీర్‌కుమార్ గుప్తా, చీఫ్ బ్రిడ్జి ఇంజినీర్ అశోక్ కుమార్, చీఫ్ సిగ్నలింగ్ ఇంజినీర్ డి.కె.మల్లిక్, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైవే పనుల్లో నాణ్యతకు తూట్లు

- రాజవొమ్మంగి వాసుల ఆరోపణ
- రోడ్డుపై పెద్ద ఎత్తున ఆందోళన


రాజవొమ్మంగి ప్రధాన కూడలి వద్ద అస్తవ్యస్తంగా జరుగుతున్న హైవే పనులు

రాజవొమ్మంగి: స్థానికంగా జరుగుతున్న హైవే పనులను ఇష్టానుసారంగా చేస్తున్నారని, నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపిస్తూ స్థానికులు సోమవారం రాత్రి పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి, మలుపు వద్ద జాతీయ రహదారి పనుల్లో నాణ్యతాలోపం స్పష్టంగా కనిపిస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజు వందలాది వాహనాలు తిరిగే ఈ ప్రాంతంలో రహదారి విశాలంగా నిర్మించాల్సి ఉండగా ఇరుకుగా వేస్తున్నారని స్థానికులు మండి పడ్డారు. ఒక దశలోవాహనాల రాకపోకలను నిలిపివేశారు. రాజవొమ్మంగి నాలుగు రోడ్ల కూడలి వద్ద డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని వారు తెలిపారు. రంపచోడవరం నుంచి రాజవొమ్మంగి వరకు దాదాపు 71 కిలోమీటర్ల మేర ఈ రహదారి పనులు సక్రమంగా జరుగుతుండగా, రాజవొమ్మంగి సెంటర్లో మాత్రం ఎందుకు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయని స్థానికులు ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆందోళనకారులు బిగ్గరగా నినాదాలు చేశారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా స్థానిక సెంటర్లో పెద్ద పెద్ద గోతులు తీసి నాలుగు నెలలు దాటిపోతోందని, నేటికీ పనులు పూర్తి కాకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతలో స్థానిక సీఐ సన్యాసినాయుడు తన సిబ్బందితోపాటు సంఘటనాస్థలానికి వచ్చి ఆందోళన కారులను శాంతింపజేశారు. ఉదయం హైవే అథారిటీ ఇంజినీర్లతో మాట్లాడదామని స్థానికులకు హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

గ్రామ వలంటీర్లను నమ్మించి వంచిస్తున్నారు

- తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి
- ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు



పాడేరు : ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు గ్రామ వలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్ చేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ వలంటీర్లను నియమించిందన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ ఫలాలను గడపవద్దకే తీసుకువెళ్లి లబ్ధిదారులకు అందజేసేందుకు వలంటీర్లు ఎంతగానో శ్రమించారని చెప్పారు. ఎన్నికల సమయంలో గ్రామ వలంటీర్లకు రూ.10వేల గౌరవ వేతనం చెల్లిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక హామీని అమలు చేయకుండా వందరోజుల పాటు కాలయాపన చేశారన్నారు. ఎన్నికల ముందు నమ్మించి అధికారంలోకి వచ్చాక వంచించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. గ్రామ వలంటీర్ల భవితవ్యం అయోమయంగా మారిందని గ్రామ వలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకొని బకాయి పడిన నాలుగు నెలల గౌరవం వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామ వలంటీర్లు చేసే ప్రతి ఉద్యమానికి వైఎస్సార్‌సీపీ పూర్తిగా అండగా ఉంటుందని ఆయన చెప్పారు.

యలమంచిలి జెడ్పీ హైస్కూల్ టీచర్‌కు షోకాజ్

- తిరస్కరించిన ఉపాధ్యాయిని

యలమంచిలి రూరల్: స్థానిక జెడ్పీ హైస్కూలు ప్లస్-2లో ఇంగ్లిష్ పీజీటీగా పనిచేస్తున్న చింతల రాధారాణికి డీఈవో ఎం వెంకటలక్ష్మమ్మ షోకాజ్ నోటీస్ జారీ చేశారని ప్రధానోపాధ్యాయిని వీవీ హిమబిందు సోమ వారం తెలిపారు. ఇటీవల ఇంగ్లిష్ టీచర్ రాధారాణి తీరుకు నిరసనగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు తరగతులు బహిష్కరించి ఆందోళనకు దిగిన విషయం విదితమే. ఈ మేరకు సదరు టీచర్ పరిమితికి మించి సెలవులు పెట్టడం, విధులకు ఆలస్యంగా రావడం, గతంలో పనిచేసిన స్కూళ్లలో పనితీరు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం తదితర అంశాలకు సంబంధించి యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, జంపపాలెం హెచ్ఎం శాస్త్రి విచారణ చేసి డీఈవోకు నివేదించారు. ఈ మేరకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. దీన్ని తిరస్కరిస్తున్నట్టు హెచ్ఎంకు ఇచ్చిన ఆఫీస్ కాపీలో ఇంగ్లిష్ టీచర్ రాసిచ్చినట్టు యలమంచిలి ఉపవిద్యాశాఖాధికారి తెలిపారు. సదరు టీచర్‌పై వచ్చిన ఆరోపణలపై తగు వివరణ ఇవ్వాలని నోటీసులో డీఈవో ఆదేశించినట్టు హెచ్ఎం తెలిపారు.

బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ వ్యక్తికి ఐదేళ్ల జైలు

మునగపాక: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితునికి 5 సంవత్సరాల కారాగార శిక్షతో పాటు రూ.17వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి జి.ఆనందిని సోమవారం తీర్పు ఇచ్చినట్టు జిల్లా ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మునగపాక మండలం నాగవరంలో కిరాణా దుకాణం నడుపుతున్న వ్యక్తికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 2019 ఫిబ్రవరి 10న అదే గ్రామానికి చెందిన లారీ క్లీనర్ బండారు రమణ బాలికకు మాయమాటలు చెప్పి డాబాపైకి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. నిత్యం తమ దుకాణానికి వస్తూ పిల్లలతో చనువుగా ఉంటున్న వ్యక్తి ఈ దారుణానికి ఒడిగట్టడంతో బాలిక ఏడుస్తూ జరిగిన సంఘటనను తండ్రికి వివరించింది. బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించడంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు తగిన ఆధారాలను కోర్టు ముందు ఉంచారు. నేరం రుజువు కావడంతో నిందితుడు రమణకు 5 సంవత్సరాల కారాగార శిక్షతో పాటు రూ.17వేల జరిమానా విధించారు. పీపీ కరణం కృష్ణ వాదనలు వినిపించారు. నిందితుడికి శిక్ష పడేలా దర్యాప్తు నిర్వహించిన అధికారులను ఎస్పీ దీపిక అభినందించారు.

నేటి మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు అప్పన్న దర్శనాలు బంద్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లభించవని దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ తెలిపారు. రానున్న శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయ శుద్ధి(కోయిల్ తిరుమంజన్ సేవ) నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పోలీసులపై బీచ్ వ్యాపారుల దాడి

బీచ్‌రోడ్డు: అల్లూరి జిల్లాకు చెందిన కానిస్టేబుల్ ఎస్.కె.రహీం, నగరానికి చెందిన హోంగార్డులు అనిల్, నూకరాజు ఆదివారం బీచ్‌కు వెళ్లారు. ఐస్ క్రీం కొనుగోలు చేశారు. నగదు చెల్లింపు విషయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. అక్కడి వ్యాపారులు వీరిపైదాడికి పాల్పడ్డారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పోలీసులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

47 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు


గంజాయి, కారుతోపాటు పట్టుబడ్డ నిందితులు

మాడుగుల రూరల్: మండలంలోని తాటిపర్తి గ్రామ శివారులో ఏజెన్సీ నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ జి. నారాయణరావు సోమవారం తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సూరజ్ కుమార్, అంకిత్ ఖోకర్ పాడేరులో 47 కిలోలు గంజాయి కొనుగోలు చేశారన్నారు. అక్కడ నుంచి చోడవరం వైపు కారు (ఎం.పి.04 సిఎక్స్ 5801)లో వస్తుండగా, ముందస్తు సమాచారం మేరకు తాటిపర్తి శివారులో తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి గంజాయి, కారును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

స్వర్ణాంధ్ర-2047పై విద్యార్థులకు పోటీలు


విజేతలతో డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: స్వర్ణాంధ్ర -2047పై విద్యార్థులకు సోమవారం జిల్లా స్థాయిలో వివిధ అంశాలపై పోటీలు నిర్వహించినట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వం, డిబెట్ పోటీలకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 63 మంది పాల్గొన్నారన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. విజన్ డాక్యుమెంట్లలో విద్యార్థులంతా పాల్గొని రాష్ట్ర అభివృద్ధికి తగు సూచనలు ఇవ్వాలని సూచించారు.

గోవు మృతి: ఐదుగురు సస్పెన్షన్


దీన్‌దయాల్‌పురం వద్ద పశు సంరక్షణ కేంద్రంలో ఆవు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో కిశోర్..

ఆరిలోవ: జీవీఎంసీ పశు సంరక్షణ కేంద్రంలో ఓ ఆవు మృతి చెందిన సంఘటనలో ఐదుగురు వైద్య ఆరోగ్య సిబ్బందిని సస్పెండ్ చేశారు. వివరాలు ఇలా..జీవీఎంసీ 20వ వార్డు పరిధి పోలమాంబ ఆలయ ప్రాంతంలో పిన్నింటి మోహనరావుకు చెందిన చూడితో ఉన్న ఆవు ఈనెల 26న రోడ్డు డివైడర్‌పై ఉన్న మొక్కలు మేస్తుండగా పశు సంరక్షణ కేంద్రం సిబ్బంది పట్టుకొన్నారు. దీన్ని 13వ వార్డు పరిధి దీన్‌దయాల్‌పురంలో ఉన్న జీవీఎంసీ పశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. అప్పటి నుంచి సంరక్షణలో ఉన్న ఆవు ఆదివారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకొన్న ఆవు యజమాని మోహనరావు, 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్‌తో కలిసి సోమవారం కేంద్రానికి చేరుకొని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తన ఆవు మృతి చెందిందని జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జోన్-2 ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ కేంద్రానికి చేరుకొని మృతి చెందిన ఆవును పరిశీలించారు. నిర్లక్ష్యం వహించిన ఐదుగురు సిబ్బందిని సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. పశువులను జాగ్రత్తగా సంరక్షించుకోవాలని, పాడి, చూడితో ఉన్న ఆవులను రోడ్లపై విడిచిపెట్టవద్దని ఆవు యజమానికి సూచించారు.

రిటైర్డ్ పోలీసులకు సీపీ సన్మానం


ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులతో సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన ఏసీపీ, ఆర్ఎస్ఐ, ఏఆర్ఎస్ఐలను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సన్మానించారు. ఏసీపీ సి.హెచ్.శ్యామలరావు, ఆర్ఎస్ఐ ఆర్.వి.రమణ, ఏఆర్ఎస్ఐ కె.ఆనందరావులు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. వీరిని కుటుంబ సభ్యులతో కమిషనర్ కార్యాలయానికి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా సీపీ శంఖబ్రత బాగ్చి సన్మానించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో 40 ఏళ్లు సుదీర్ఘ కాలం సర్వీస్ చేయడం గొప్ప విషయమన్నారు.